ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

హత్నూర, ఏప్రిల్ 1 : హత్నూర మండలం రెడ్డిఖానాపూర్‌లో జరిగిన మల్లికార్జునస్వామి జాతరకు సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా స్థానిక నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని సూచించారు. తెలంగాణలో జరిగే జాతర, పండుగలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కాగా ఆలయం వద్ద అగ్నిగుండాలు, స్వామివారి కల్యాణం, బోనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, నాయకులు దామోదర్‌రెడ్డి, వీరేశం, లింగారెడ్డి పాల్గొన్నారు.

రెడ్డిఖానాపూర్‌లో మల్లన్న జాతరకు హాజరైన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

గెలుపునకు సహకరించాలి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

బొల్లారం, ఏప్రిల్ 1 : ఎంపీ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలందరూ సహకరించి గెలిపించాలని కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు బొల్లారం మున్సిపాలిటీలో కాంగ్రెస్ ముఖ్య నాయకులను కోరారు. సోమవారం బొల్లారం మున్సిపాలిటీలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులను ఇంటింటికెళ్లి కలిశారు. మెదక్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ గెలుపొందడానికి ప్రతి కార్యకర్త పని చేయాలని అభ్యర్థించారు. బొల్లారం కౌన్సిలర్ చంద్రారెడ్డి ఇంటికి వెళ్లి నీలం మధు చర్చించారు. ఎన్నికల వేళ అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్‌లో నీవాయిస్ వినిపించాలని మధుతో అన్నారు. ఎలాంటి ఆందోళన వద్దని బొల్లారం మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు లభిస్తుందని నీలం మధుకు భరోసా ఇచ్చారు. పెద్దల సహకారం ఉంటే పార్లమెంట్‌లో అడుగు పెడతానని ధీమా వ్యక్తం చేశారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, కౌన్సిలర్లు గోపాలమ్మ, చంద్రయ్య, కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, సంపత్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

బొల్లారంలో చంద్రారెడ్డిని కలిసిన కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

భక్తిశ్రద్ధలతో లక్షదీపోత్సవం

సంగారెడ్డి, ఏప్రిల్ 1 : భక్తుల కొంగు బంగారంగా కొలువదీరిన భవానీమాత ఆలయంలో లక్షదీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ఇస్మాయిల్‌ఖాన్‌పేట(ఈశ్వరపురం)లోని భవానీమాత ఆలయ వార్షికోత్సవంలో భాగంగా భక్తిశ్రద్ధలతో మహిళలు దీపాలు వెలిగించి భక్తిభవాన్ని చాటారు.

ఈశ్వరపురంలో లక్ష దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సీజ్ చేసిన షెడ్లలో దర్జాగా దందా

- టీఎస్ ఐలా అధికారుల ఆదేశాలు బేఖాతర్
- ఇండస్ట్రియల్ ల్యాండ్‌లో కమర్షియల్ షెడ్ల నిర్మాణం
- ప్రతి షెడ్‌కు నోటీసు అతికించి మూసివేసిన అధికారులు
- షెటర్లను తెరిచి వ్యాపారం కొనసాగిస్తున్న వైనం

సీజ్ చేసిన షెటర్‌ను కొంతవరకు తెరిచిన వ్యాపారి, అధికారులు అతికించిన నోటీసు

రామచంద్రాపురం, ఏప్రిల్ 1 : అధికారుల ఆదేశాలను కొందరు వ్యాపారులు బేఖాతర్ చేస్తున్నారు. షెడ్‌ల నిర్మాణాలకు అనుమతులు లేవంటూ ఐలా అధికారులు ఆయా షెడ్‌లకు సీజింగ్ నోటీసులు అతికించి తాళాలు వేయించినా వ్యాపారులు మాత్రం అధికారుల కండ్లుకప్పి దర్జాగా వ్యాపారం చేస్తున్నారు. ఆర్సీపురం డివిజన్‌లోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఇండస్ట్రియల్ ల్యాండ్‌లో పెద్ద ఎత్తున ఐదు కమర్షియల్ షెడ్‌లను ఓ వ్యాపారి నిర్మించారు. ఇండస్ట్రియల్ ల్యాండ్‌లో కమర్షియల్ షెడ్లు వేయడంతో పలువురు టీఎస్ ఐలా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఐలా జోనల్ మేనేజర్ అనురాధ ఇటీవల షెడ్ల నిర్వహణపై విచారణ చేసి అనుమతులు లేకుండా కమర్షియల్ షెడ్లను నిర్మించినట్లు గుర్తించి ఆయా మార్బల్, టైల్స్ దుకాణాలకు సీజింగ్ నోటీసులు అతికించి తాళాలు వేయించారు. అదేవిధంగా వాటి పక్కనే మరో షెడ్‌లో టోయోట షోరూం పనులను నిలిపివేసి నోటీసులు జారీ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ షెడ్‌లను ఏర్పాటు చేయించిన వ్యాపారి, ఆషెడ్‌లను లీజుకు తీసుకున్న కొందరు వ్యాపారులు అధికారుల కండ్లు కప్పి షెటర్లను దొంగతనంగా తెరుస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నారు. అధికారులు ఒకసారి సీజ్ చేసిన తర్వాత వాటిని తెరిచే హక్కు మనకు ఉండదు. ఒకవేళ అధికారుల ఆదేశాలు బేఖాతర్ చేస్తే చట్టరీత్యా నేరం. షెడ్ల నిర్వహణకు సంబంధిత అధికారుల నుంచి అనుమతుల రూపంలో గ్రీన్ సిగ్నల్ వచ్చినప్పుడు మాత్రమే షెటర్లను తెరవాలి. కానీ ఇక్కడ అలాంటి నిబంధనలు వ్యాపారులు పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అధికారుల ఆదేశాలను పాటించకుండా షెటర్లను తెరువడంపై పలువురు విస్మయం చెందుతున్నారు. మధ్యాహ్నం, రాత్రి సమయంలో ఎవరూ చూడకుండా షెటర్లకు అడ్డంగా కార్లు, ట్రాన్స్‌పోర్ట్ ఆటోలు పెట్టి షెటర్లను కొంతమేర తెరిచి మార్బల్స్, టైల్స్ ట్రాలీ ఆటోలో లోడ్ చేసి లోడింగ్ పూర్తికాగానే ఆటోలను బయటకు పంపిస్తున్నారు. పెద్ద షెటర్లకు చిన్న డోర్ మాదిరిగా ఎంట్రీని కూడా ఏర్పాటు చేసి వాటిని ఓపెన్‌గా ఉంచుతూ కార్యకలాపాలను జరుపుతున్నారు. ట్రాలీ ఆటోల్లో లోడింగ్ పూర్తయిన తర్వాత షెటర్లను క్లోజ్ చేస్తున్నారు. టోయోట షోరూంలో రాత్రి వేళ నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు. అధికారులు సీజ్ చేసిన రెండో రోజు నుంచే ఈ తంతు జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు.

షెడ్‌లను ఖాళీ చేయిస్తాం

ఆర్సీపురంలోని ఇండస్ట్రియల్ ల్యాండ్‌లో ఏర్పాటు చేసిన కమర్షియల్ షెడ్‌లకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఇటీవల సీజ్ చేశారు. అయినా సదరు వ్యాపారి షెటర్లను తెరిచి వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే షెడ్‌లను ఖాళీ చేయించి వాటిని తొలిగిస్తాం. ఇండస్ట్రియల్ ల్యాండ్‌లో కమర్షియల్ వ్యాపారం చేయడానికి వీలు లేదు.

- అనురాధ, ఐలా జోనల్ మేనేజర్

దళారులను నమ్మి మోసపోవద్దు

అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి, ఏప్రిల్ 1 : రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేటప్పుడు దళారులను నమ్మిమోసపోవద్దని, ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకు అమ్ముకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని అదనపు కలెక్టర్ మాధురి సూచించారు. సోమవారం కంది మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యాసంగిలో పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. అరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీవో తుమ్మ ప్రసాద్, డీసీసీబీ, పీఏసీఎస్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఓటర్ చైతన్య కార్యక్రమాలు

- 100 శాతం ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 1 : స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 3 నుంచి 30 తేదీ వరకు ప్రత్యేక ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులతో స్వీప్ కార్యక్రమాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వందశాతం పోలింగ్ జరిగేలా కార్యక్రమాలు రూపొందించినట్లు పేర్కొన్నారు. స్వీప్ క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 3న అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఆయా గ్రామాల ఓటరు జాబితాను బీఎల్వోలు ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, స్వీప్ నోడల్ అధికారి జగదీశ్‌రెడ్డి, ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా చర్యలు చేపట్టాలి

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, మండల ప్రత్యేక అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఐదేండ్లలోపు పిల్లలు, 60 ఏండ్ల పెద్దలు, వృద్ధులు ఇండ్ల నుంచి బయటికి రావద్దని సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావాలని, ఉపాధి హామీ కూలీలు 12 గంటల లోపు పనులు పూర్తి చేసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో మున్సిపల్ ఇంజినీర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు సమన్వయంతో పని చేసి తాగునీటిని సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. తాగునీటి కోసం 0845 5276155 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు వేసవిలోనూ అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

న్యాల్‌కల్, ఏప్రిల్ 1 : జహీరాబాద్ పట్టణంలోని 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతుండడంతో మంగళవారం మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఇంజినీరింగ్ అధికారి అర్జున్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు మండలంలోని హద్నూర్, న్యాల్‌కల్, మిర్జాపూర్(బి), డప్పూర్, చాల్కి, మెటల్‌కుంట, మామిడ్గి గ్రామాల్లోని సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. మండలంలోని ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

జహీరాబాద్ సబ్ స్టేషన్ పరిధిలో..

కోహీర్, ఏప్రిల్ 1 : జహీరాబాద్ పట్టణ విద్యుత్ సబ్ స్టేషన్‌లో 33|12కేవీ మరమ్మతుల కారణంగా డివిజన్‌లోని కోహీర్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆయా గ్రామాల్లో మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని జహీరాబాద్ విద్యుత్ శాఖ డీఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

నేడు ఎంపీపీపై అవిశ్వాసం

జిన్నారం, ఏప్రిల్ 1 : జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్‌పై మంగళవారం అవిశ్వాసం జరుగనున్నది. ఉదయం 11 గంటలకు అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో అవిశ్వాస సమావేశం నిర్వహించనున్నారు. మొత్తం ఎనిమిది ఎంపీటీసీ స్థానాల్లో ప్రస్తుతం కాంగ్రెస్‌కు నలుగురు ఎంపీటీసీలు, బీఆర్ఎస్‌కు నలుగురు ఎంపీటీసీలు ఉన్నారు. రెండు పార్టీలకు చెరి సమానం సభ్యులు ఉండడంతో ఏం జరుగబోతుందనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

గాయపడిన దంపతులకు ఆర్థికసాయం

సంగారెడ్డి, ఏప్రిల్ 1 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన దంపతులకు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అయ్యప్ప సేవా సమితి అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నది. సోమవారం పట్టణంలోని సంజీవనగర్ నివాస్తులైన సంతోషి–నాగరాజు దంపతులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న అయ్యప్ప ఆపద్బాంధవ సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జనప్రియ రాజు గురుస్వామి మాట్లాడుతూ నిత్యం పూజలతో పాటు సేవా కార్యక్రమాలకు సేవాసమితిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సేవ చేయడంలో ఆనందం ఉందని, అపదలో ఉన్నవారి వివరాలు తమ సమితి దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి తమకు తోచిన సాయం అందించేందుకు ముందుకు వస్తామన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షుడు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు జయప్రకాశ్, ప్రధాన కార్యదర్శి సాహితీ రాము, కోశాధికారి మాణిక్యరెడ్డి, సభ్యులు పులిపాల వెంకన్న, కొక్కొండ శ్రీశైలం, గుండ్లపల్లి నరేశ్ కుమార్, శ్రీకాంత్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

న్యాల్‌కల్, ఏప్రిల్ 1 : జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీపాటిల్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలందరూ కృషి చేయాలని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు అరుణ కౌలస్ అన్నారు. సోమవారం మండల బీజేపీ అధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి జగన్నాథ్, మండలాధ్యక్షుడు ఓంకర్ యాదవ్, నాయకులు మల్లేశం, రహుల్, శ్రీకాంత్, మల్లేశం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

రామచంద్రాపురం, ఏప్రిల్ 1: ఆర్సీపురం డివిజన్‌లోని మల్లికార్జునగర్‌కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయాన్ని అలంకరించి స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలను పూజారులు నిర్వహించారు. వార్షికోత్సవం వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నగేశ్, ఆదర్శ్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, అధ్యక్షుడు సత్యనారాయణ, వెంకటస్వామి, జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీలత, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

న్యాల్‌కల్, ఏప్రిల్ 1 : వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండలంలోని మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి నృపేన్‌చక్రవర్తి సూచించారు. సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది కంటే ఈ సంవత్సరం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు బయటకు వెళ్లవద్దన్నారు. అలాంటి పరిస్థితి వస్తే ప్రజలు ఆసలు మధ్యాహ్న వేళ బయటకు రావడం పక్కన బెడితే శరీరంలో నీటి శాతం తగ్గుతుందన్నారు. దీంతో ఎండల తీవ్రతకు తట్టుకోలేక మృత్యువాత పడే అవకాశం ఉందని, తగుజాగ్రతలు పటిస్తే మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్యామల, మల్లికార్జున్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి గుంజోట్టిలో విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు

న్యాల్‌కల్, ఏప్రిల్ 1 : మండలంలోని గుంజోట్టి గ్రామంలో మానసాదేవి నాగదేవత విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మంగళ వారం నుంచి 4వతేదీ వరకు జరిగే ఉత్సవాలకు పలు ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులు డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్, వీరశ్వర శివాచార్య మహాస్వామి, శివయోగ శివచార్యస్వామి, దేవగిరి మహారాజ్, విశ్వగిరి మహారాజ్, రాచయ్యస్వామి తదితరులు హాజరుకానున్నారని, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఉత్సవ కమిటీ నిర్వాహకుడు శివశంకర్ పాటిల్ కోరారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను సిద్ధం చేశారు.

ఎన్నికల కోడ్ ఉన్నా తొలగని వాల్ పోస్టర్లు

ఝరాసంగం పరిధిలో వాల్ పోస్టర్

ఝరాసంగం, ఏప్రిల్ 1 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 15 రోజులవుతున్నా అధికారులు పలు పార్టీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను తొలిగించలేదు. ఝరాసంగం మండల కేంద్రంలోని శ్మశాన వాటిక వద్ద జాతీయ పార్టీకి సంబంధించిన వాల్ పోస్టర్, నర్సపూర్ గ్రామంలో పలుచోట్ల రోడ్డు పక్కన ఉన్న గోడలకు, కిరాణ షాప్‌లకు వాల్ పోస్టర్లు ఉన్నా ఎవరు పట్టించుకోవడంలేదు.

75శాతం ఆస్తి పన్ను వసూలు

బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు

బొల్లారం, ఏప్రిల్ 1 : ఆస్తి పన్ను వసూళ్లలో బొల్లారం మున్సిపాలిటీ 2023–24 ఆర్థిక సంవత్సరం ఆదివారంతో ముగియగా 75 శాతం వసూళ్లు చేసింది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్.. ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు సిబ్బంది నిర్దేశించుకున్న లక్ష్యాలను 75 శాతం పూర్తి చేయగలిగారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత, పన్ను బకాయిలు రూ.16 కోట్లు డిమాండ్ ఉండగా రూ.13 కోట్లు వసూలు చేశారు. కమిషనర్ మంగతాయారు సూచన మేరకు అధికారులు బృందాలుగా ఏర్పడి ఎలాంటి విరామం లేకుండా ఇంటింటికీ తిరుగుతూ వ్యక్తిగత లక్ష్యాలను పూర్తి చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం గత నెల చివర్లో వన్ టైం సెటిల్మెంట్ (ఓటీఎస్) కింద 90 శాతం రాయితీ కల్పించింది. దీనిపై మున్సిపాలిటీలో అధికారులు సిబ్బంది ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో మంచి స్పందన వచ్చింది. మొత్తం 8 వేల గృహాలకు సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరానికి డిమాండ్ 16 కోట్లు ఉండగా 13 కోట్లు వసూలు చేశారు. 2024–25 ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్1వ తేదీ నుంచి 5 శాతం రిబేట్‌తో ఆస్తి పన్నులు చెల్లించే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ మంగతాయారు సోమవారం ప్రకటనలో తెలిపారు.

బొల్లారంలో ప్రజల నుంచి ఆస్తి పన్ను వసూలు చేస్తున్న అధికారులు

అశ్వవాహన సేవలో వీరభద్రుడు

అశ్వవాహనసేవలో దర్శనమిస్తున్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

గుమ్మడిదల, ఏప్రిల్ 1 : రుద్రావతారుడైన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో రెండో రోజు బ్రహ్మోత్సవాల్లో భాగంగా వీరభద్రస్వామి వారు, భద్రకాళీ అమ్మవారు అశ్వవాహన సేవలో పురవీధుల మీదుగా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. జూనియర్ అసిస్టెంట్ సోమయ్య పర్యవేక్షణలో ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఆలేటి జగన్మోహన్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, అర్చకులు శివనాగులు, శంకరప్ప,రాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

జిన్నారం, ఏప్రిల్ 1 : కొడకంచి గ్రామంలో హైదరాబాద్ ఏవీ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఎన్ఎస్ఎస్ క్యాంపులో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రోగ్రామింగ్ ఆఫీసర్ అంజయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనం, రోడ్ల పక్కన, పాఠశాల ఆవరణలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. ఎండుముఖం పట్టిన మొక్కలకు నీటి సౌకర్యం కల్పించారు. చీపుర్లతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శెట్టి శివరాజ్, రాజు పాల్గొన్నారు.

కొడకంచిలో హరితహారంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ప్రారంభమైన సప్తాహ

మనూరు, ఏప్రిల్ 1 : రేవప్పయ్య స్వామి ఆలయంలో సప్తాహ ప్రారంభమైంది. మండల పరిధిలోని మాయికోడ్ గ్రామం రేవప్పయ్య స్వామి ఆలయంలో ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సప్తాహ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించామని గ్రామస్తులు తెలిపారు. ఆలయంలో ప్రతి ఏడాది ఉగాది పండుగ సమయంలో సప్తాహ నిర్వహించనున్నారని తెలిపారు. సప్తాహ కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు ఒక ప్రత్యేక కార్యక్రమాలు, ముగింపు రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

7న ప్రవేశ పరీక్ష

బొల్లారం, ఏప్రిల్ 1: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ పాఠశాల 2024–25 ప్రవేశ పరీక్ష ఈ నెల 7న నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి ప్రవేశాల కోసం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏడు నుంచి పదో తరగతి ప్రవేశాల కోసం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

జిన్నారం, ఏప్రిల్ 1 : ఊట్ల గ్రామ పంచాయతీ దాదిగూడెం గ్రామంలో ముదిరాజ్ సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా దాదిరమేశ్, ఉపాధ్యక్షుడిగా గంగురాజు, ప్రధాన కార్యదర్శిగా ఎంకిరిగారి రవి, కార్యదర్శిగా మోత కృష్ణ, కోశాధికారిగా నల్లమధు, ఆర్గనైజర్‌గా వడ్డెపల్లి శ్రీనివాస్, ఇతర కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. గ్రామ పెద్దల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.

మూడు ట్రాక్టర్లకు నిప్పు

కంగ్టి, ఏప్రిల్ 1 : ఆగి ఉన్న మూడుట్రాక్టర్లను గుర్తుతెలియని దుండగులు నిప్పంటించి ధ్వంసం చేసిన ఘటన కంగ్టి మండలం దామరిగిద్ద గ్రామశివారులో సోమవారం చోటు చేసుకుంది. కంగ్టి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దామరిగిద్ద గ్రామానికి చెందిన వీర్‌శెట్టి, పండరి, పోలీస్‌పాటిల్ హన్మంత్‌రావులకు చెందిన మూడుట్రాక్టర్లను గుర్తుతెలియన దుండగులు నిప్పుపెట్టారని ఎస్సై తెలిపారు. గ్రామశివారులోని చెరువు నుంచి మట్టితరలించి అక్కడే నిలుపగా అక్కడ ఈ ఘటన జరిగిందన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ బాధితులకు మెరుగైన సేవలు

ఎస్పీ చెన్నూరి రూపేశ్

సైబర్ వారియర్స్‌కు ఫోన్లు అందజేసిన ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి, ఏప్రిల్ 1: సమాజంలో సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కు ఫోన్లు, సిమ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్స్‌ను ఏర్పాటు చేసి వారికి ప్రత్యేక ఫోన్లు, సిమ్‌లు అందజేస్తామన్నారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు 1930కి కాల్ చేయడం గానీ, ఎన్సీఆర్పీ పోర్టల్‌లో గానీ ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లావాసులు ఈ సేవలను వినియోగించుకోవాలని, బాధితులు ఫిర్యాదులను నమోదు చేస్తేనే గుర్తించడం సులువవుతుంతదని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో సంగారెడ్డి సైబర్‌సెల్ ఇన్‌చార్జి డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రవి, టెక్నీషిన్ రాజలింగం గౌడ్, సైబర్ వారియర్స్ సభ్యులు పాల్గొన్నారు.

బొమ్మారెడ్డిగూడెంలో మద్యం పట్టివేత

చౌటకూర్, ఏప్రిల్ 1: మండలంలోని బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాలో ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గిరిజన తండాకు చెందిన నేనావత్ దేవిసింగ్, మూడ్ అర్జున్లు వేర్వేరుగా స్థానికంగా కిరాణా దుకాణాలు నిర్వహిస్తూనే మరో వైపు అక్రమంగా, అనుమతిలేకుండా మద్యం విక్రయిస్తున్నారు. సమాచారం మేరకు జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బీరు బాటిళ్లు, దేశీ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమతిలేకుండా, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి తెలిపారు.

గిరిజన తండాలోని కిరాణ దుకాణంలో పట్టుబడిన మద్యం బాటిళ్లు

జహీరాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తాం

అందోల్, ఏప్రిల్ 1: లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం జోగిపేటలో పార్టీ క్రియాశీలక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ గెలుపుతోనే జహీరాబాద్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పలు పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, ప్రాధన కార్యదర్శి అనంత్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ చెంద్రయ్య స్వామి, నాయకులు ప్రభాకర్ గౌడ్, పల్వట్ల జగదీశ్వర్, శంకర్ పాల్గొన్నారు.

ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరుతున్న నాయకులు

కొండపోచమ్మకు బోనాలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 1 : ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో మల్ల న్న స్వామి జాతరలో భాగంగా సోమవారం కొండ పోచమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు. ఆర్సీపురంలో కురుమల కొండ పోచమ్మకు బోనాల సమర్పణ వేడుకల్లో భాగంగా ఘట్టం ఊరేగింపు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు గోవింద్ ఘట్ట ం ఎత్తుకోగా, కార్పొరేటర్ పుష్పానగేశ్ మహిళలతో కలిసి బోనాలను ఎత్తుకొని పోతరాజుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘట్టం, బోనాల ఊరేగింపులో కార్పొరేటర్ పుష్పానగేశ్